క్లుప్తంగా

రేపు శివుడికి విశేష అభిషేకాలు

నల్లకుంట: మాస శివరాత్రి సందర్భంగా శనివారం(రేపు) న్యూ నల్లకుంటలోని శ్రీ సీతా రామాంజనేయ సరస్వతి ఆలయ ప్రాంగణంలో గల పర్వత వర్ధిని సమేత రామలింగేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు ఉంటాయని ఆలయ ఈఓ కె. జయంతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా శివుడికి విశేష అభిషేకాలు ఉంటాయన్నారు.

నేడు 'చంద్రమౌళి భారతం' గ్రంథావిష్కరణ

నల్లకుంట: తెలుగు భాషా చైతన్య సమితి, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తాధ్వర్యంలో శుక్రవారం(నేడు) ప్రముఖ రచయిత రామకృష్ణ చంద్రమౌళి రచించిన 'చంద్రమౌళి భారతం' గ్రంథావిష్కరణ సభ ఉంటుందని తెలుగు భాషా చైతన్య సమితి అధ్యక్షుడు పి. బడేసాబ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం నల్లకుంట శివం రోడ్డు సిండికేట్ బ్యాంక్ సమీపంలో గల శ్రీధర్ ప్లాజాలో కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. కవి విమర్శకులు గంటా మనోహర్ రెడ్డి సభాధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయం పూర్వ ఉపకులపతి కొలకలూరి ఇనాక్, విశిష్ట అతిథిగా ఓయూ తెలుగు విభాగం పూర్వ అధ్యక్షుడు ఆచార్య కసిరెడ్డి వెంకట రెడ్డి, తెలుగు విశ్వ విద్యాలయం పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య టి. గౌరీశంకర్ ఆత్మీయ అతిథులుగా తెలుగు రచయితల సంఘం అధ్యక్షుడు డాక్టర్ నాకేశ్వరం శంకరం, దర్పణం సాహిత్య వేదిక అధ్యక్షుడు డాక్టర్ రాయారావు సూర్యప్రకాశ్ రావు హాజరై తమ సందేశాన్ని ఇస్తారని చెప్పారు.

25న ఇందిరాపార్కు వద్ద బీజేపీ మహాధర్నా

కాచిగూడ: పేదలకు డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లను పంపిణీ చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు అన్నారు. గురువారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను వెంటనే పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 25వ తేదీన బీజేపీ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సంపూర్ణ ఆరోగ్యానికి మొక్కలు నాటండి



మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్ ఎస్.సవిత

కాచిగూడ: మనిషికి ప్రాణ వాయువునిచ్చే మొక్కలను విరివిగా పెంచితేనే సంపూర్ణ ఆరోగ్యంగా బతకవచ్చని, అందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని శ్రీ చైతన్య స్కూల్ బర్కత్‌పుర ప్రిన్సిపాల్ ఎస్.సవిత అన్నారు. గురువారం స్కూల్ ప్రాంగణంలో 'హరిత భారత్' కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు విద్యతో పాటు అన్ని విషయాలపై సరైన అవగాహన కల్పించాలనే ఉద్దేశంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆమె తెలిపారు.

రైతుల ఆత్మహత్యలపై శ్వేతపత్రం విడుదల చేయాలి

కాచిగూడ: 1996 నుంచి ఇప్పటి వరకు రాష్ట్రంలో రైతులు ఎంత మంది ఆత్మహత్య చేసుకున్నారో శ్వేతపత్రం విడుదల చేయాలని తెలంగాణ ప్రజా జీవన రైతు పార్టీ అధ్యక్షుడు చుండి శోభన్‌బాబు డిమాండ్ చేశారు. గురువారం నారాయణగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. రైతులు ఉచిత విద్యుత్ అడగలేదని, మేనిఫెస్టోలో ఇచ్చిన అన్ని హామీలు తక్షణం అమలు చేయాలని అన్నారు. గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు.

రేపు ఓయూలో మహాధర్నా

లాలాపేట: ఈ నెల 15న ఉస్మానియా యూనివర్సిటీలో కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు మహాధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పరశురాం తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను గురువారం ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట ఆవిష్కరించారు. తమను రెగ్యులరైజ్ చేయాలనే డిమాండ్‌తో నిర్వహిస్తున్న మహాధర్నాకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 12 యూనివర్సిటీల నుంచి కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు హాజరవుతారన్నారు.

మర్యాదపూర్వక కలయిక

లాలాపేట: బోనాల జాతర సందర్భంగా గురువారం లాలాపేటకు చెందిన పలువురు ఆలయ కమిటీ సభ్యులు డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్‌ను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. లాలాపేటలో అమ్మవారి దేవాలయాల వద్ద ఉత్సవాల ఏర్పాట్లపై చర్చించారు. పెద్ద ఎత్తున వేడుకల నిర్వహణకు ఆర్థిక సహాయం చేసినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. లాలాపేటలో జరిగే బోనాల ఉత్సవాలకు రావాలని కోరుతూ పద్మారావుగౌడ్‌ను ఆహ్వానించారు. అనంతరం ఆలయ కమిటీ నాయకులు మల్లికార్జున్‌కు చెక్కును అందజేశారు.

బోనాల పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ముఠా గోపాల్ తదితరులు

కవాడిగూడ: కవాడిగూడ డివిజన్ ఎల్‌ఐసీ కార్యాలయ సమీపంలోని అంబేద్కర్‌నగర్‌లో వీరమైసమ్మ ఆలయంలో గురువారం భక్తిశ్రద్ధలతో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్‌ఎస్ యువజన విభాగం నాయకులు ముఠా జైసింహాలు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ బోనాల పండుగకు ఎంతో విశిష్టత ఉందన్నారు. కార్యక్రమంలో కమిటి అధ్యక్షులు సిరిగి ప్రసాద్, ఉపాధ్యక్షులు కేశవ్, ప్రధాన కార్యదర్శి వెంకటేష్, నాయకులు నర్సింగ్‌రావు, నర్సింగ్, జె.సతీష్, సురేష్, మహేష్, సతీష్, అనిల్, స్వామితో పాటు భక్తులు పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయాలవద్ద 500 ఎల్‌ఈడీ లైట్ల ఏర్పాటు

చిక్కడపల్లి : బోనాల సందర్భంగా గాంధీనగర్ డివిజన్‌లోని 34 అమ్మవారి ఆలయాల వద్ద 500లకు పైగా ఎల్‌ఈడీ బల్బులు ఏర్పాటు చేయిస్తున్నట్లు డివిజన్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ తెలిపారు. ఆషాడబోనాల జాతర సందర్భంగా గాంధీనగర్ డివిజన్ పరిధిలోని అమ్మవారి ఆలయాల వద్ద జీహెచ్‌ఎంసీ ద్వారా నిర్వహిస్తున్న ఏర్పాట్లను కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రతి ఏడాది లాగే ఈ సంవత్సరం కూడా ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్న విద్యుత్ దీపాల అమరిక దేవాలయాలవద్ద గుంటలు లేకుండా రోడ్డు ప్యాచ్‌వర్క్ పనులను పరిశీలించారు. బీజేపీ నగర యువనేత వినయ్‌కుమార్, నాయకులు రఘుయాదవ్, సత్యేందర్, సాయికుమార్ పాల్గొన్నారు.

బోనాల పండుగకు ముస్తాబవుతున్న లోయర్ ట్యాంక్‌బండ్

కవాడిగూడ: లోయర్ ట్యాంక్‌బండ్‌లోని శ్రీ కనకాల కట్టమైసమ్మ దేవాలయంలో ఆషాఢమాస బోనాల పండుగను ఘనంగా నిర్వహించేందుకు ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఆలయ ఫౌండర చైర్మన్ గౌతమ్‌కుమార్ పటేల్, అధికారులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. బోనాల పండుగ సందర్భంగా శ్రీ కనకాల కట్టమైసమ్మ దేవాలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఈ నెల 16వ తేదీన జరిగే బోనాల పండుగ, 17వ తేదీన జరిగే రంగం ఏర్పాట్లకు సంబంధించి కార్యక్రమాల పోస్టర్‌ను ఆలయ ఫౌండర్, చైర్మన్ గౌతమ్‌కుమార్ పటేల్, దేవాదాయ శాఖ ఆలయ కార్యనిర్వహణ అధికారి సాంబశివరావు, ఆర్చకులు స్వాతిక్ శర్మ, రాజేష్‌శర్మ, సత్యనారాయణతో కలిసి ఆవిష్కరించారు.

భక్తులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు.

కవాడిగూడ: ఆషాఢబాసం బోనాల పండగ సందర్భంగా కవాడిగూడ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఉన్న అమ్మవారి దేవాలయాల వద్ద పేరుకుపోయిన మట్టికుప్పలు, చెత్తను తొలగించేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నట్లు కార్పొరేటర్ జి.రచనశ్రీ తెలిపారు. గురువారం డివిజన్‌లోని జ్యోతినగర్లో ఉన్న రత్నాల మైసమ్మ దేవాలయం ఎదురుగా ఉన్న మట్టికుప్పలు, చెత్తను మున్సిపల్ అధికారులు, జేసీబీ ద్వారా తొలగిస్తున్న పనులను ఆమె పర్యవేక్షించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేష్, స్వామి, రవి, కృష్ణ, రాజు, సురేష్‌బాబు, ఎల్లయ్య, లింగం తదితరులు పాల్గొన్నారు.



బోనాల పండుగ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్



మట్టి తొలగింపు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ జి.రచనశ్రీ



బోనాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

బస్ భవన్ ముందు బధిరుల ఆందోళన



ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బధిరులు

ముషీరాబాద్: బధిరులకు ఆర్టీసీ పరిధిలో నాలుగు శాతం రిజర్వేషన్లు అమలు చేసి ప్రభుత్వ, కాంట్రాక్టు ఉద్యోగాలు భర్తీ చేయాలని డెవలప్‌మెంట్ ఆఫ్ సొసైటీ ఫర్ డెఫ్ రాష్ట్ర అధ్యక్షులు వల్లభనేని ప్రసాద్, ప్రధాన కార్యదర్శి వి.భారతీ డిమాండ్ చేశారు. బధిరులు, వికలాంగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం బస్ భవన్ ముందు నిరసన చేపట్టి అనంతరం ఆర్టీసీ ఎండి సజ్జనార్‌కు వినతిపత్రం అందజేశారు. టీఎస్‌ఆర్టీసీ బడ్జెట్‌లో నాలుగు శాతం నిధులు కేటాయించాలని, బస్టాండ్‌లలోని పార్కింగ్ స్థలాలు, దుకాణాల సముదాయాలలో పది శాతం వికలాంగులకు కేటాయించాలని, ప్రతి బధిర వికలాంగుడికి సదరం సర్టిఫికెట్ ఉన్న వారికి 50 శాతం కన్సిషనల్ బస్ పాస్ ఇవ్వాలని కోరారు.

యువతి అదృశ్యం

కాచిగూడ: యువతి అదృశ్యమైన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ రావు తెలిపిన మేరకు.. రాజస్థాన్‌కు చెందిన లక్కారామ్ తన మేనకోడలు వర్ష (20) తో స్వస్థలానికి వెళ్లడానికి బుధవారం రేణిగుంట రైల్వే స్టేషన్‌లో చెన్నై చెంగల్పట్టు రైలును ఎక్కి కాచిగూడకు వస్తున్నారు. గురువారం కాచిగూడ రైల్వే స్టేషన్‌లో విశ్రాంతి గదిలో ఉన్నారు. తర్వాత ఆమె కనిపించకపోవడంతో లక్కారామ్ ఫిర్యాదు మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు.

తల్లి దూషించిందని..



సి. దీపక్(ఫైల్)

నల్లకుంట: తల్లి ఫోన్ చేసి అసభ్యకరంగా దూషించడంతో మనస్తాపానికి గురైన ఓ బాలుడు (15) అదృశ్యమైన సంఘటన నల్లకుంట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై రమాదేవి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నల్లకుంట శివానంద నగర్‌కు చెందిన సంజీవ్ కుమార్ ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. భార్య గంగమ్మతో విబేధాల కారణంగా కొంత కాలంగా వేర్వేరుగా ఉంటున్నారు. తొమ్మిదో తరగతి చదువుతున్న వారి పెద్ద కుమారుడు దీపక్(15) తండ్రితో పాటు ఉంటున్నాడు. చిన్న కుమారుడు దిలీప్ బీదర్‌లో తల్లి గంగమ్మ వద్ద ఉంటున్నాడు. ఈ నెల 10న ఉదయం దీపక్‌కు ఫోన్ చేసిన తల్లి గంగమ్మ అసభ్యంగా దూషించడమేగాక 'నువ్వు బతకడం ఎందుకు చచ్చిపోరా' అంది. దీంతో దీపక్ మనస్తాపానికి లోనయ్యాడు. 11న ఉదయం స్కూల్‌కు వెళ్లిన అతను సాయంత్రం ఇంటికి తిరిగి రాకపోవడంతో ఆందోళనకు గురైన అతడి తండ్రి బంధువులు, తెలిసిన వారిని విచారించగా దీపక్ స్కూల్‌కు వెళ్లలేదని తెలిసింది. అతడికోసం గాలించినా ఆచూకీ తెలియకపోవడంతో బుధవారం రాత్రి నల్లకుంట పోలీసులకు ఫిర్యాదు చేశాడు, మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గ్రేటర్‌ను చెత్త రహిత నగరంగా తీర్చిదిద్దాలి

చిలకలగూడ: గ్రేటర్ హైదరాబాద్‌ను చెత్త రహితంగా తీర్చిదిద్దేందుకు రూపొందించిన ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలను పకడ్బందీగా అమలు చేయాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్ అన్నారు. సికింద్రాబాద్ జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో జోనల్ కమిషనర్లు, పారిశుద్ధ్య అధికారులతో గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించి పలు సూచనలు, సలహాలు చేశారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా తగిన చర్యలు చేపట్టాలని, చెత్త వేసే పాయింట్లను గుర్తించడంతో పాటు పరిసర ప్రాంత ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో సీజనల్ వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందన్నారు. సర్కిళ్ల వారీగా చెత్త డంపింగ్ పాయింట్లు, ఇళ్ల నుంచి సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుకు తరలించే విధి విధానాలపై ఆరా తీశారు. ఆయా సర్కిళ్ల పరిధిలోని చెత్త కుండీలను శాశ్వతంగా తొలగించడంతో పాటు మళ్లీ ఆ ప్రాంతంలో చెత్త వేయకుండా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి, కమిషనర్లు రవికిరణ్, శ్రీనివాసరెడ్డి, పంకజా, మమత, జాయింట్ కమిషనర్లు ఉమాప్రకాశ్, సంధ్యలతో పాటు రాంకీ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక భావనతోనే మానసిక ప్రశాంతత



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు

ముషీరాబాద్: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావన అలవర్చుకోవాలని అప్పుడే మానసిక ప్రశాంతత లభిస్తుందని బీఆర్‌ఎస్ గ్రేటర్ హైదరాబాద్ సీనియర్ నాయకులు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు అన్నారు. గురువారం అడిక్‌మెట్ డివిజన్ రాంనగర్‌లోని మేడిబావి బస్తీలో నల్లపోచమ్మ దేవాలయంలో ఆషాడమాసాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బోనాల ఉత్సవాలను ప్రజలు ఐక్యంగా జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు జంగ శ్రీనివాస్, జహంగీర్ పాల్గొన్నారు.

బీఎస్ రావు మృతికి సంతాపం

కాచిగూడ: శ్రీ చైతన్య విద్యా సంస్థల చైర్మన్ బీఎస్ రావు గురువారం హైదరాబాద్‌లో తుది శ్వాస విడిచారు. బీఎస్ రావు మృతి పట్ల బర్కత్‌పురలోని శ్రీ చైతన్య స్కూల్ సిబ్బంది ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళుర్పించారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ రాజేంద్ర ప్రసాద్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బీఎస్ రావు మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తున్న ప్రిన్సిపాల్ ఎస్.సవిత

వేడుకగా ఉత్కృష్ట సోమయాగం



కాచిగూడ: ప్రగతి సుధామ ఆధ్వర్యంలో గురువారం ప్రకృతి మాతా ఫౌండేషన్‌లో ప్రగతి రిసార్ట్స్ డాక్టర్ జీబీకే రావు నిర్వహించిన శ్రీ మహాగ్నిచయన పూర్వక సర్వపృష్ఠ సర్వస్తోమ అప్తోర్యామ ఉత్కృష్ట సోమయాగంలో బర్కత్‌పురకు చెందిన సెంట్రల్ పీస్ కమిటీ అసిస్టెంట్ సెక్రెటరీ ఎస్.శరత్ శ్యామ్ ఆధ్వర్యంలో సెంట్రల్ పీజ్ కమిటీ ప్రతినిధులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పద్మశ్రీ కార్తికేయన్, స్వామి సాక్షి రూపానంద్, ఎన్‌ఆర్‌ఐ పి.హరిందర్ రెడ్డి, సెంట్రల్ పీస్ కమిటీ ఆల్ జోన్స్ ప్రధానకార్యదర్శి శ్రీకిషన్ శర్మ పాల్గొన్నారు.

సాంస్కృతిక సంస్థలు సేవా కార్యక్రమాలు నిర్వహించాలి



నగదు సహాయం అందజేస్తున్న రామరాజు, నాగమణి

చిక్కడపల్లి: సాంస్కృతిక సంస్థలు సేవా కార్యక్రమాలు కూడా చేయాలని వంశీ సంస్థల అధినేత డాక్టర్ వంశీ రామరాజు అన్నారు. త్యాగరాయగాన సభలో రాగరంజని స్వరార్చన సంస్థ ఆధ్వర్యంలో గురువారం సినీ సంగీత విభావరి జరిగింది. సంస్థ స్థాపకురాలు నామణి సహ నాయకులు రాజని ఫాల్గుణ, సురేంద్ర సేతుకుమార్, నాగరాజు, ప్రవీణ్, మురళి గాయనీమణులు సుజాత, లలిత, శాంతి, స్వాతి, శివాని, లక్ష్మీరత్నం, తదితరులతో కలసి అలనాటి, నేటి సిని గీతాలు ఆలపించారు. అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో నాగమణి దంపతులు నగదు సహాయం అందజేశారు.

ఓయూలో జీ-20 పోటీలు



లాలాపేట: జీ-20 యూనివర్సిటీ కనెక్ట్‌లో భాగంగా ఓయూ ఆర్ట్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన క్విజ్, వ్యాసరచన, వక్తృత్వ పోటీలను గురువారం ప్రిన్సిపాల్ ప్రొ. గణేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులు ఇలాంటి పోటీల్లో పాల్గొనడం ద్వారా వారిలోని నైపుణ్యాన్ని మరింత మెరుగుపరుచుకోవచ్చునని అన్నారు. ఈ కార్యక్రమంలో ఓయూ అనుబంధ కళాశాలల నుంచి దాదాపు 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలో విజేతలైన వారికి శుక్రవారం దూరవిద్యా కేంద్రం ఆడిటోరియంలో జరిగే కార్యక్రమంలో బహుమతులు అందజేస్తారని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రొ. స్టీవెన్‌సన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బోనాల వేడుకలకు ముందస్తు ఏర్పాట్లు



న్యూ పటేల్‌నగర్‌లో వీధిలైట్లను ఏర్పాటు చేయిస్తున్న కార్పొరేటర్ విజయ్‌కుమార్ గౌడ్

అంబర్‌పేట: బోనాల ఉత్సవాలకు ఆలయాల పరిసరాల్లో మెరుగైన వసతులు కల్పించేందుకు చొరవ తీసుకుంటున్నట్లు అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ విజయ్‌కుమార్ గౌడ్ తెలిపారు. గురువారం డివిజన్‌లోని పటేల్‌నగర్, న్యూపటేల్‌నగర్, ప్రేమ్‌నగర్ తదితర ప్రాంతాల్లో వీధిలైట్ల మరమ్మతులను చేపట్టారు. అమ్మవారి ఆలయాల పరిసరాల్లో పారిశుధ్యం, మురుగునీరు, వీధిలైట్లు వంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు కార్పొరేటర్ తెలిపారు. కార్యక్రమంలో స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

బాగ్అంబర్‌పేటలో..

బాగ్అంబర్‌పేట డివిజన్‌లో బోనాల ఏర్పాట్లపై కార్పొరేటర్ పర్యటించారు. అంతర్గత రోడ్లు, డ్రైనేజీ, వీధిలైట్లు వంటి ఏర్పాట్లను ఆమె పరిశీలించారు. ఆమె వెంట స్థానిక బీజేపీ నేతలు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనంచేస్తున్న విద్యార్థి సంఘాల నేతలు

కాచిగూడ: విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వామపక్ష విద్యార్థి సంఘాల నేతలు ఆరోపించారు. ఖమ్మంలో అనుమతి లేకుండా పాఠశాల నడుపుతూ విద్యార్థి నాయకులపై దాడి చేసిన ఢిల్లీ పబ్లిక్ స్కూల్ యాజమాన్యంపై చట్టపరంగా తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గురువారం నారాయణగూడ చౌరస్తాలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను విద్యార్థి సంఘాల నేతలు దగ్ధం చేశారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించమంటే లాఠీచార్జీ, అక్రమ అరెస్టులు చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నేతలు టి.నాగరాజు, ఆర్ ఎల్ మూర్తి, ఎఐఎస్‌ఎఫ్ నేత పుట్టా లక్ష్మణ్, పిడిఎస్‌యూ నేతలు మహేష్, ఎస్.నాగేశ్వర్ రావు, రామకృష్ణ, నాగరాజు, ఎఐడిఎస్‌ఓ నేత మల్లేష్, ఎఐఎస్‌బి నేత గవ్వ వంశీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బోనాల వేడుకలకు మంత్రికి ఆహ్వానం

అంబర్‌పేట: అంబర్‌పేటలో జరిగే మహాంకాళి అమ్మవారి బోనాల వేడుకలకు హాజరు కావాల్సిందిగా రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డికి ఆలయ కమిటీ ప్రతినిధులు ఆహ్వానించారు. గురువారం ఆయన నివాసంలో కలిసి ఆహ్వాన పత్రం అందించారు. మంత్రిని కలిసిన వారిలో ఆలయ కమిటీ ప్రతినిధులు దుర్గాప్రసాద్‌రెడ్డి, గిరిధర్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ కె.పద్మావతిరెడ్డిలు ఉన్నారు.



మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డికి ఆహ్వానపత్రం అందజేస్తున్న మహాంకాళి ఆలయ కమిటీ ప్రతినిధులు

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట: సీఎం రిలీఫ్ ఫండ్ పథకం పేద ప్రజల వైద్యానికి భరోసా కల్పిస్తుందని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. గురువారం తన క్యాంపు కార్యాలయంలో 13 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ పథకం క్రింద మంజూరైన రూ.4.69 లక్షలు విలువచేసే చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. నియోజకవర్గంలో అర్హులైన ప్రతిఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చొరవ తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో లబ్ధిదారులు, స్థానిక బీఆర్‌ఎస్ నేతలు పాల్గొన్నారు.

నైపుణ్యాలు మెరుగుపర్చుకోవాలి



నియామకపు పత్రాలు అందజేస్తున్న జాహ్నవి విద్యా సంస్థల చైర్మన్ ఎ.పరమేశ్వర్

కాచిగూడ: నైపుణ్యాలను మెరుగు పరుచుకోవడం ద్వారానే కెరీర్‌లో అత్యుత్తమ అవకాశాలను అందిపుచ్చుకునేందుకు విద్యార్థులకు అవకాశం లభిస్తుందని జాహ్నవి విద్యాసంస్థల చైర్మన్ పరమేశ్వర్ పేర్కొన్నారు. జాహ్నవి విద్యాసంస్థల ఆధ్వర్యంలో గురువారం నారాయణగూడలోని జాహ్నవి మహిళా డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన జాబ్‌మేళాలో విద్యార్థినులు పాల్గొని తమ ప్రతిభా పాటవాలను చాటుకున్నారు. 15 మల్టినేషనల్ కంపెనీలకు పైగా ప్రతినిధులు పాల్గొని విద్యార్థినులను వారివారి నైపుణ్యాలను బట్టి ఎంపిక చేశారు. జాబ్‌మేళాలో దాదాపు 100 మంది విద్యార్థినీలు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్మన్ ఎ.లక్ష్మీ, ప్రిన్సిపాల్ రాజేశ్వరి, వివిధ కంపెనీల హెచ్ ఆర్‌లు, కళాశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సివిల్స్ సర్వీసెస్ పరీక్షా విధానంపై ఉచిత అవగాహన

చిక్కడపల్లి: ఇండియన్ సివిల్ సర్వీస్ ఎగ్జామ్‌ను ప్రవేశపెట్టి 170 సంవత్సరాలు అయిన సందర్భాన్ని పురస్కరించుకుని ఈ నెల 17 నుంచి23 వరకు సివిల్స్ సర్వీస్ పరీక్షా విధానం పై ఉచిత అవగాహన తరగతులు నిర్వహిన్నట్లు కేపీ సార్ యూపీఎస్‌సి యూనివర్స్ చైర్మన్ కృష్ణ ప్రదీప్ ఒక ప్రకటనలో తెలిపారు. గత 20 సంవత్సరాలుగా పోటీ పరీక్షలకు శిక్షణ ఇస్తున్న తాము సామాజిక బాధ్యతగా రెండు తెలుగు రాష్ట్రాల నుంచి ఎక్కువమంది సివిల్స్ పరీక్షల్లో విజయం సాధించాలనే లక్ష్యంతో ఉచిత అవగాహన తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. ఉచిత రిజిస్ట్రేషన్ కోసం 9392957733 నెంబరుకు ఫోన్ చేయవచ్చన్నారు.

ఉచిత కరెంటు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదే



అనిల్‌కుమార్‌యాదవ్

ముషీరాబాద్: భారతదేశంలో ఎవరు ఆలోచించని విధంగా 20 ఏళ్ల క్రితమే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రైతులకు ఉచిత విద్యుత్‌ను ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని ముషీరాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి అనిల్‌కుమార్‌యాదవ్ తెలిపారు. గురువారం ముషీరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అనని మాటలను అన్నట్లుగా చిత్రీకరించి ఆయన చిత్రపటాలను దగ్ధం చేయడం నీతిమాలిన చర్య అని విమర్శించారు. రైతుల గురించి ఆలోచించేది కాంగ్రెస్ పార్టీనే అని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రైతులకు ఉచిత విద్యుత్‌తో పాటు నాణ్యమైన విత్తనాలను సబ్సిడీ ధరలకే ఎరువులను, రైతులకు గిట్టుబాటు ధరలను కల్పించారని గుర్తు చేశారు. రైతులు పండించిన పంటలో నెలల తరబడి రోడ్లపై ఉన్న కొనుగోలు చేయని అసమర్థ ప్రభుత్వం కేసిఆర్ ప్రభుత్వానిదని ధ్వజమెత్తారు. మార్కెట్‌లో ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడంతో ఎంతో మంది రైతులు మృతి చెందారని అలాంటి ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదని తెలిపారు. ఇప్పటికైనా బీఆర్‌ఎస్ నాయకులు చౌకబారు విమర్శలు మానుకోవాలని హితవుపలికారు.

నేడు పలుచోట్ల విద్యుత్ సరఫరా నిలిపివేత

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: టీఎస్‌ఎస్‌పీడీసీఎల్ 11కేవీ ఆజామ్‌బాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ మరమ్మత్తుల నిమిత్తం పలు ప్రాంతాల్లో ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏడిఈ విజయ భాస్కర్ తెలిపారు.

ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు

బర్కత్‌పురా బస్ డిపో ఫీడర్ పరిధిలో రత్ననగర్, సత్యనగర్, బీజేపీ ఆఫీస్, అవంతి డిగ్రీ కాలేజ్, కాచిగూడ జూనియర్ కాలేజీ, హుడ్‌ల్యాండ్ ఆసుపత్రి తదితర ప్రాంతాల్లో ..

మధ్యాహ్నం 12నుంచి 2 గంటల వరకు

టూరిస్టు హోటల్ ఫీడర్ పరిధిలో చప్పల్‌బజార్, బజాజ్ షోరూమ్, కాచిగూడ మెయిన్ రోడ్డు ప్రాంతాల్లో

మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు

సి.సి.సెరప్ ఆసుపత్రి ఫీడర పరిధిలో భూమన్న గల్లి, రాజేంద్రనగర్ కాలనీ, లింగంపల్లి తదితర ప్రాంతాల్లో

3 నుంచి 5 గంటల వరకు,

మౌలానా ఆజాద్ ఫీడర్ పరిధిలో కుమార్ థియేటర్, చప్పల్ బజార్, రహమత్‌నగర్, ఫన్నాలాల్ బిల్డింగ్ ప్రాంతాల్లో

3.30 గంటల నుంచి 5 గంటల వరకు

సుందర్ నగర్ ఫీడర్ పరిధిలో కృష్ణానగర్, నెహ్రూనగర్, బోస్ ఫ్యాక్టరీ, కాచిగూడ కమెలా తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు.